# సాక్షి చిత్తూరు

మంగళవారం । 4 । మార్చి । 2025

7




## విన్నపాలు.. వినవలె

కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన ప్రజా వేదికలో జిల్లాలోని పలువురు తమ సమస్యలను కలెక్టర్‌కు విన్నవించారు. - 8లో



## పరీక్ష కేంద్రం తనిఖీ

చిత్తూరు పట్టణంలోని పీసీఆర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ పరీక్షల భద్రతను ఎస్పీ తనిఖీ చేశారు. - 8లో



## స్వీయరక్షణలో పట్టు సాధించాలి

బాలికలు చిన్నప్పటి నుంచే ఆత్మరక్షణపై పట్టు సాధించాలని జిల్లా సమగ్ర శిక్ష ఏపీసీ వెంకటరమణ సూచించారు. - 8లో




# కనిపించేనా నవోదయం

నాటుసారా తయారీ రూపుమాపేందుకు కూటమి ప్రభుత్వం మరోసారి 'నవోదయం 2.0'ను తెరపైకి తీసుకొచ్చింది. గత టీడీపీ ప్రభుత్వంలో నవోదయం తీసుకొచ్చినా ఎలాంటి సత్ఫలితాలు ఇవ్వలేదు. ఈ కార్యక్రమాన్ని మళ్లీ అదే పేరుతో కూటమి ప్రభుత్వం ప్రజల్లోకి తీసుకొచ్చింది. లక్ష్యాలు ఘనంగా ఉన్నా క్షేత్ర స్థాయిలో ఫలించి ప్రతిబింబించడం అంత సులువు కాదు. ఈ వృత్తిలో కూరుకుపోయిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం, రుణాలు ఇప్పించడం మాటల్లో చెప్పినంత సులువు కాకపోవడంతో 'నవోదయం' మాటలకే పరిమితం అవుతుందనే వాదన చర్చకు దారితీస్తోంది.

గుడిపాల కృష్ణజమ్మాపురం అడవుల్లో సారా ఊటలను ధ్వంసం చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు



### ఊబి నుంచి బయటపడలేక..

జిల్లాలోని కొన్ని సామాజిక వర్గాలకు చెందిన అట్టడుగు వర్గాలు ఉండటానికి ఇళ్లు లేకుండా, సేద్యం చేసుకోవడానికి భూమి లేక, కుటుంబాన్ని నడిపించే ఆర్థిక స్తోమత లేక.. ఇక బతకాలంటే ఇది తప్పదు అన్నట్లు నాటుసారా తయారీని ఎంచుకుంటున్నారు. దాదాపు మూడు తరాల నుంచి దీన్నే వృత్తిగా ఎంచుకున్న కుటుంబాలు ఆ ఊబి నుంచి బయటపడలేకపోతున్నాయి. నాటుసారా తయారు చేయడం, వాటిని చుట్టుపక్కల ప్రాంతాలకు రవాణా చేయడం, తాగించడం చేస్తూ జీవితాన్ని నెట్టుకొస్తున్నారు.

- నాటు సారా నివారణకు మళ్లీ తెరపైకి 'నవోదయం 2.0'
- సారా తయారీకి ప్రత్యామ్నాయం కోసం అన్వేషణ
- జిల్లాలో 50కు పైగా గ్రామాలు.. 300 మంది గుర్తింపు
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆదుకోని వైనం

చిత్తూరు అర్బన్ : నాటుసారా తయారీ వ్యవస్థను రూపుమాపేందుకు కూటమి ప్రభుత్వం 'నవోదయం 2.0' తీసుకొచ్చింది. సారా తయారీని గ్రామ స్థాయిలోనే అరికట్టడం, దీనిపై ఆధారపడిన కుటుంబాలకు రుణాలు, ఇతర ఉపాధి మార్గాలు చూపించడమే నవోదయం లక్ష్యంగా కూటమి ప్రభుత్వం చెబుతోంది. ఏ మేరకు రాణిస్తుందనే విషయంపై స్పష్టత లేదు. ఎందుకంటే 2014–19లో అధికారంలో ఉన్న టీడీపీ ప్రభుత్వం .. అప్పట్లోనే తీసుకొచ్చి నవ్వులపాలయింది.

### కూలీలను తీసుకొచ్చి వ్యాపారం

నాటుసారా వృత్తిలో చేయి తిరిగిన బడా వ్యక్తులు లేకపోలేదు. కూలీలను తీసుకొచ్చి, నాటుసారా తయారు చేయించి అన్ని ప్రాంతాలకు సరఫరా చేస్తూ రూ.కోట్లకు పడగలెత్తినవాళ్లూ ఉన్నారు. అయితే సారా తాగడం వల్ల అనారోగ్య సమస్యలు తలెత్తడం, సగటు మనిషి ఆయుష్షు తగ్గిపోతుండటం, సమాజంలో సారా తయారీ, సేవించే వాళ్లపై చిన్నచూపు కనిపిస్తోంది. కొన్ని ప్రాంతాల్లో సారా తయారీ కేంద్రాలు కుటీర పరిశ్రమలుగా రూపాంతరం చెందాయి. నాటుసారాను గ్రామ స్థాయిలో పూర్తిగా నిర్మూలించడానికి నవోదయం తీసుకొచ్చినా కూటమి ప్రభుత్వం.. దీనిపై ఆధారపడిన వారికి శాశ్వత ఉపాధి, ఉద్యోగ అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉంది. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో సారాను తయారు చేయించే బడా స్మగ్లర్లపై ప్రివెంటివ్ డిటెన్షన్ (పీడీ) యాక్టులు పెట్టడంతో పాటు ఎన్‌ఫోర్స్‌మెంట్ పేరిట ఉక్కుపాదం మోపింది.



గుడిపాల రాసనపల్లె అడవుల్లో సారా బట్టీలు వెలికి తీస్తున్న ఎక్సైజ్ పోలీసులు

### సారా తయారీపై ఆధారపడి కుటుంబాలు..

జిల్లాలో దాదాపు 55కు పైగా గ్రామాల్లో సుమారు 300 మంది నాటుసారా తయారీపై ఆధారపడి జీవిస్తున్నారు. ఉన్నట్టుండి వీళ్లు సారా తయారీని వదులుకునే అవకాశం ఉండదు. కానీ వీళ్లకు సేద్యం చేయడానికి భూమి, స్వయం ఉపాధి కోసం బ్యాంకు రుణాలు, ప్రభుత్వ–ప్రైవేటు రంగాల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగాల్లాంటివి చూపిస్తే తప్పకుండా సారా తయారీను త్యజించడానికి వెనుకాడరు. ష్యూరిటీ లేకుండా రుణాలు ఇవ్వడానికి బ్యాంకర్లు ముందుకు రాకపోవడం, ఆటో, ఇతర స్వయం ఉపాధి కార్యక్రమాలు గ్రామాల్లోని లబ్ధిదారుల ఇష్టంతో సంబంధం లేకుండా అధికారులే యూనిట్లను నిర్ణయించడం లాంటి గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

### గ్రామాలకు రవాణా..

సారా తయారీతో పాటు వాటిని ఇతర గ్రామాలకు రవాణా చేసే గ్రామాల్లో చిత్తూరులోని రాసనపల్లె, పాలసముద్రంలోని నరసింహాపురం, నగరి సత్రవాడ, విజయపురం మంగళం, కెవి.పురం, పుంగనూరులోని పెద్దతండా, నల్లగుంట్లపల్లె తండా, పత్రపల్లె తండాలు ఉన్నాయి. అలాగే ఇతర ప్రాంతాలకు కాకుండా తయారు చేసి, అక్కడే విక్రయించడం.. ఇతర ప్రాంతాల్లో తయారయ్యే సారాను తెచ్చుకుని గ్రామాల్లో విక్రయించే ప్రాంతాలు ఉన్నాయి.

### ప్రత్యామ్నాయ ఉపాధి కల్పిస్తాం



సారా తయారీకి అలవాటు పడ్డ వ్యక్తులు, కుటుంబాలను ఆ మార్గం నుంచి పక్కకు తప్పించడంతో పాటు.. వారికి ఉపాధి చూపించడమే నవోదయం లక్ష్యం. జిల్లాలో ఇప్పటికే అత్యధికంగా నాటు సారా తయారీ ఎక్కడెక్కడ తయారు చేస్తున్నారు..? ఎంత మంది దీనిపై ఆధారపడ్డారనే విషయాలను గుర్తించాం. వీళ్లకు ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాల కల్పించడానికి ఇప్పటికే గ్రామాల్లో సభలు ఏర్పాటు చేస్తున్నాం. సారా తయారీ మానుకుని, ప్రభుత్వం ఇచ్చే ఆర్థిక భరోసాతో కుటుంబాలు మారాలనే లక్ష్యాన్ని తప్పకుండా సాధిస్తాం.

– విజయశేఖర్, డిప్యూటీ కమిషనర్, ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్

## అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు : కలెక్టర్



మాట్లాడుతున్న కలెక్టర్ సుమిత్ కుమార్

చిత్తూరు కలెక్టరేట్ : రెవెన్యూ సదస్సులు, ప్రజా సమస్యల పరిష్కార వేదికలో నమోదైన అర్జీలను సత్వరం పరిష్కరించాలని కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ తహసీల్దార్లను, అధికారులను ఆదేశించారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్‌లో పలు శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. 2024 డిసెంబర్ నుంచి 2025 జనవరి 8 వరకు రెవెన్యూ సదస్సుల్లో నమోదైన ప్రతి అర్జీని పరిష్కరించాలన్నారు. పరిష్కార వేదికలో నమోదైన అర్జీలను ఈనెల 15వ తేదీలోపు పరిష్కరించాలని తెలిపారు. సమావేశంలో జేసీ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ పాల్గొన్నారు.

## వినికిడి లోపాలపై అవగాహన కల్పించండి



ర్యాలీ నిర్వహిస్తున్న అధికారులు

చిత్తూరు రూరల్ (కాణిపాకం): వినికిడి లోపాలపై అవగాహన కల్పించి, ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకునేలా చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ సుధారాణి పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యాలయం నుంచి ర్యాలీ చేపట్టారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. వయస్సు ప్రభావం, దీర్ఘకాలిక చెవి సమస్యలు, జన్యుపరమైన కారణాలు, అధిక శబ్దం తదితర కారణాలతో వినికిడి లోప సమస్యలు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్, అధికారులు శ్రీవాణి, జయరాముడు, ఆశ తదితరులు పాల్గొన్నారు.

## న్యూస్‌రీల్

### విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణపై రాయితీ

చిత్తూరు కార్పొరేషన్ : విద్యుత్ అదనపు లోడ్ క్రమబద్ధీకరణపై గృహ వినియోగదారులకు 50 శాతం డిస్కౌంట్ ప్రభుత్వం ప్రకటించిందని ట్రాన్స్‌కో తిరుపతి, చిత్తూరు ఎస్ఈలు సురేంద్రనాయుడు, ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. తిరుపతి జిల్లాలో 7.95 లక్షల మంది, చిత్తూరు జిల్లాలో దాదాపు 4.37 లక్షల మంది కలిపి మొత్తం 12.32 లక్షల మంది సర్వీసులను క్రమబద్ధీకరించుకోవాలన్నారు. సాధారణ రోజుల్లో కిలో వాట్‌కు రూ.2 వేలు క్రమబద్ధీకరణ రుసుం చెల్లించాల్సి ఉండగా ప్రస్తుతం రూ.1000 చెల్లిస్తే చాలన్నారు. జూన్ 30 వరకు ఈ అవకాశం ఉంటుందని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వీటిని ఏపీఎస్పీడీసీఎల్ వెబ్‌సైట్ లేదా సంబంధిత విద్యుత్ బిల్లుల వసూళ్ల కేంద్రంలో చెల్లించవచ్చన్నారు.

### ఆరోగ్య సేవలపై శిక్షణ



మాట్లాడుతున్న జిల్లా క్షయ నివారణ అధికారి

చిత్తూరు రూరల్ (కాణిపాకం): జిల్లాలో వైద్య ఆరోగ్య కార్యక్రమాలను పకడ్బందీగా నిర్వర్తించాలని జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్ ఆదేశించారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం ఆయన ఆరోగ్య విస్తరణ సేవలపై ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. గల్ల పరీక్షల విషయంలో నిర్లక్ష్యం ఉండకూడదన్నారు. పక్కాగా పరీక్షలు చేసి కచ్చితమైన నివేదిక ఇవ్వాలన్నారు. కొత్త కేసులకు పౌష్టికాహారం నిమిత్తం ప్రభుత్వం రూ.1000 చొప్పున అందజేస్తున్నామని పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు లోహిత్, శివకుమార్, స్టాఫ్ నర్సులు పాల్గొన్నారు.

### వైద్య సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలి

చిత్తూరు రూరల్ : దోమల నిర్మూలనకు చర్యలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి వేణుగోపాల్ పేర్కొన్నారు. చిత్తూరు నగరంలోని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో సోమవారం ల్యాబ్ టెక్నీషియన్లతో సమీక్ష సమావేశం నిర్వహించి మాట్లాడారు. మలేరియా, డెంగ్యూ కేసులు నమోదు కావడంతో సిబ్బంది అప్రమత్తంగా పనిచేయాలన్నారు. ఫీవర్ కేసులతో వచ్చే వారికి రక్తపరీక్షలు చేపట్టాలన్నారు. పాజిటివ్ కేసులకు తక్షణ వైద్య సేవలు అందేలా చూడాలన్నారు. దోమల వ్యాప్తిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. తగు జాగ్రత్తలు తీసుకునేలా చూడాలని వివరించారు. సమావేశంలో జిల్లా క్షయ నివారణ అధికారి వెంకట ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# రెడ్‌బుక్‌పై ఉన్న శ్రద్ధ..మేనిఫెస్టోపై లేదా?



సత్యవేడు సబ్‌జైలు సమీపంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్‌కే.రోజా

సత్యవేడు: రెడ్‌బుక్‌పై పెట్టిన శ్రద్ధ ఎల్లో మ్యానిఫెస్టోపై ఎందుకు పెట్టడం లేదని మాజీ మంత్రి ఆర్‌కే రోజా ప్రశ్నించారు. సోమవారం సత్యవేడు సబ్‌జైలులో రిమాండ్‌లో ఉన్న నగరి నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ కార్యకర్తలను ఆమె పరామర్శించారు. అనంతరం మాజీ మంత్రి మాట్లాడుతూ ఎప్పుడో ఐదేళ్లకు ముందు మాట్లాడారని, ఇప్పుడు మనోభావాలు దెబ్బతిన్నాయని 311 కేసు పెట్టి ఆరోగ్యం సరిలేని పోసాని మురళీకృష్ణని అరెస్టు చేసి భయభ్రాంతులకు గురిచేస్తున్నారన్నారు. ప్రెస్‌మీట్‌లో మట్లాడితే దేశద్రోహం అవుతుందా..? అని ప్రశ్నించారు. గతంలో ప్రధాని మోదీ గురించి చంద్రబాబు, లోకేష్, బాలకృష్ణ ఎలా మాట్లాడారో అందరూ విన్నారని చెప్పారు. బీజేపీ నాయకులు, ప్రధాని మోదీ వీళ్లపై కేసు పెడితే వీళ్లు బయటికి వస్తారా..? అన్ని ప్రశ్నించారు. నగరిలో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీకి చెందిన దళిత యువకులపై దాడిచేసి, వారి బైకులను తగలబెట్టి మళ్లీ వారిపైనే కేసు పెట్టడం విడ్డూరంగా ఉందన్నారు. ఇక్కడి సీఐ, డీఎస్పీ వైఎస్సార్‌సీపీ దళిత నాయకులు, కార్యకర్తలను టార్గెట్ చేసి కేసులు పెట్టి వారిని రిమాండ్‌కు పంపడం దారుణమన్నారు. ఎవరూ ఎదురు మాట్లాడకూడదని చంద్రబాబునాయుడు అసెంబ్లీలో వైఎస్.జగన్‌మోహన్ రెడ్డికి ప్రతిపక్ష హోదా ఇవ్వలేదన్నారు. దేశంలోనే ఎక్కడా లేని విధంగా దొంగదారిన పబ్లిక్ అకౌంట్ చైర్మన్ ఇవ్వడం సిగ్గు చేటన్నారు. బయట వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ వారు గట్టిగా మాట్లాడితే తప్పుడు కేసులు పెట్టి భయభ్రాంతులకు చేస్తున్నారన్నారు. ఇదేగనుక జగన్‌మోహన్‌రెడ్డి చేసి ఉంటే ఒక్క టీడీపీ కార్యకర్త, జనసేన కార్యకర్త రాష్ట్రంలో బతకగలిగే వారా..? అని ప్రశ్నించారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కేవీ.నిరంజన్ రెడ్డి, మండల సచివాలయ కన్వీనర్ బొప్పన సోమశేఖర్, సర్పంచ్ రమేష్, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు మస్తాని, వైఎస్సార్‌సీపీ టీయూసీ చైర్మన్ గోవిందస్వామి, శ్రీనివాసులురెడ్డి, పళణి, రాబర్ట్, సురేష్, నగరి నాయకులు రామ్‌ప్రసాద్ రెడ్డి, వైస్ ఎంపీపీ ఆర్ కన్నెప్ప, కౌన్సిలర్ బీడీ భాస్కర్, మాజీ ఎంపీటీసీ సంజీవ రెడ్డి పాల్గొన్నారు.

### 7న హుండీ లెక్కింపు

కాణిపాకం : ఈనెల 7వ తేదీన కాణిపాకంలోని శ్రీ వరసిద్ధి వినాయకస్వామి దేవస్థాన హుండీ లెక్కింపు జరగనున్నట్లు ఈఓ పెంచల కిషోర్ తెలిపారు. దేవస్థాన ఆస్థాన మండపంలో లెక్కింపు ప్రక్రియ ఉదయం 7 గంటలకు ప్రారంభమవుతుందన్నారు. ఆలయ అధికారులు, సిబ్బంది విధిగా హాజరు కావాలని పేర్కొన్నారు.

## పోలీస్ గ్రీవెన్స్‌లో 46 ఫిర్యాదులు

చిత్తూరు అర్బన్ : భూ సమస్యలు, సివిల్ తగాదాల్లో చట్ట పరంగానే ముందుకు వెళ్లడం జరుగుతుందని చిత్తూరు ఎస్పీ మణికంఠ స్పష్టం చేశారు. చిత్తూరు నగరంలో నిర్వహించిన పోలీసు ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని, ఏఆర్ కార్యాలయంలో నిర్వహించి ప్రజల నుంచి వినతులు తీసుకున్నారు. వీటిలో కుటుంబ తగాదాలు, వేధింపులు, మోసాలు, ఇంటి తగాదాలు, భూ తగాదాలు, లావాదేవీలకు సంబంధించిన 46 ఫిర్యాదులు అందాయి. పలు ఫిర్యాదులపై అప్పటికప్పుడే వీడియో కాన్ఫరెన్సు ద్వారా ఆయా స్టేషన్ హౌజ్ అధికారులతో మాట్లాడారు. సివిల్, భూ తగాదాల్లో విచారణ చేసిన తరువాతనే చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. చిత్తూరు డీఎస్పీ సాయినాథ్ సైతం ప్రజలనుంచి ఫిర్యాదులను తీసుకున్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎస్పీ

## విధులకు డుమ్మా.. రిజిస్టర్‌లో సంతకాలు

- జడ్పీచైర్మన్ తనిఖీలో బయటపడ్డ బాగోతం
- చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారులకు ఆదేశాలు



89-పెద్దూరులో రికార్డులను పరిశీలిస్తున్న జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

కుప్పం : విధులకు హాజరు కాకుండా డుమ్మాకొట్టి ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్న సచివాలయ ఉద్యోగుల బాగోతం సోమవారం జిల్లా పరిషత్ చైర్మన్ శ్రీనివాసులు ఆకస్మిక తనిఖీలో బయట పడింది. సచివాలయంలో అధికారులెవరూ లేకపోవడంతో.. పూర్తి రికార్డులను పరిశీలించడంతో అసలు విషయం తెలిసింది. రామకుప్పం మండలం 89–పెద్దూరు సచివాలయంలో జిల్లా పరిషత్ చైర్మన్ ఆకస్మిక తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో సచివాలయంలో ఉద్యోగులెవరూ కనబడకపోవడంతో ఆయన అవాక్కయ్యారు. తీరా రికార్డులను పరిశీలిస్తే నలుగురు ఉద్యోగులు హాజరైనట్లు రికార్డులో సంతకాలు చేశారు గానీ.. విధుల్లో లేరు. సచివాలయంలో పని చేస్తున్న ఎం.ఎస్.కె ఉద్యోగి రమీలా, ఏఎన్ఎం డిల్లెమ్మ, వీఆర్వో సనావుల్లా, ఈఏ జగేశ్వర సంతకాలు రిజిస్టరులో విధులకు హాజరైనట్లు నమోదై ఉంది. అనంతరం ఉద్యోగులను ప్రశ్నిస్తే పొంతన లేని సమాధానాలు ఇవ్వడంతో జడ్పీ చైర్మన్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉన్న సచివాలయ వ్యవస్థను భ్రష్టు పట్టిస్తున్నారని, ఉద్యోగులే విధులకు హాజరుకాక సొంత కార్యకలాపాలపై నిమగ్నమై రికార్డుల్లో సంతకాలు చేసుకుంటూ జీతాలు పొందుతున్నారని విమర్శించారు. దీనిపై జిల్లా పంచాయితీ రాజ్ అధికారికి వీరిపై చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు. వీరిపై నోటీసులు జారీ చేసి శాఖాపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## 8న సీఎంసీ ఆసుపత్రిలో కిడ్నీ చెకప్ క్యాంపు

గుడిపాల : మండలంలోని సీఎంసీ ఆసుపత్రిలో మార్చి 8వ తేదీన ప్రపంచ కిడ్నీ దినోత్సవం సందర్భంగా ఉచిత కిడ్నీ క్యాంపును నిర్వహిస్తున్నట్లు సీఎంసీ యాజమాన్యం తెలిపింది. 8వ తేదీన ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు ఈ క్యాంపు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో కిడ్నీలు బాగున్నాయా ? ముందుగానే గుర్తించండి, కిడ్నీ ఆరోగ్యాన్ని కాపాడుకోండి అనే నినాదంతో ముందుకు వెళ్లడం జరుగుతుందన్నారు.

# ఓపెన్‌గా మాస్ కాపీయింగ్

సార్వత్రిక విద్యాపీఠంలో భాగంగా (ఓపెన్ స్కూల్) సోమవారం జిల్లాల్లో ఇంటర్ పరీక్షల్లో ప్రశ్నపత్రం అందిన పుటి నుంచి మూకుమ్మడి చూచిరాతలు యథేచ్ఛగా సాగాయి. జిల్లాలో 15 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. బేరం కుదిరిన సెంటర్‌లలో మూడు బుక్‌లు, ఆరు స్లిప్పుల చందంగా చూచిరాతలతో అభ్యర్థులు చెలరేగిపోయారు.దీనికి తోడు అభ్యర్థుల స్థానంలో నకిలీలు పరీక్షకు హాజరు కాగా గుర్తించడంతో పరీక్షల నిర్వహణ ఎంత పకడ్బందీగా సాగుతున్నాయో తేటతెల్లం అవుతోంది.

- ఓపెన్ ఇంటర్‌లో నకిలీ అభ్యర్థులు పరీక్షలకు హాజరు
- పరీక్ష కేంద్రాలకు చిట్టీలతో వచ్చిన అభ్యర్థులు
- పరీక్షల నిర్వహణలో పారదర్శకత లోపం
- మొక్కుబడిగా తనిఖీలు.. పట్టించుకోని అధికారులు



చిత్తూరులోని గిరింపేట పరీక్ష కేంద్రం వద్ద చిట్టీలతో చిక్కిన అభ్యర్థి

చిత్తూరు కలెక్టరేట్ : డబ్బులిస్తే చాలు.. ఓపెన్ పరీక్ష కేంద్రాల్లో ఓపెన్‌గా పరీక్షలు రాసుకోవచ్చు. పరీక్ష కేంద్రాల్లో సిబ్బంది కాపీయింగ్‌కే కాదు ఏకంగా అభ్యర్థులకు బదులు వారిస్థానంలో ఇతరులు వచ్చి పరీక్ష రాయడానికి అనుమతిస్తారు. బేరం కుదిరితే దగ్గరుండి చిట్టీలు అందించి పాస్ గ్యారెంటీకి సహకరిస్తారు. జిల్లా వ్యాప్తంగా సోమవారం ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూళ్లు) ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఈ పరీక్షలకు హాజరైన అభ్యర్థులు చూచిరాతలకు చిట్టీలు తీసుకురావడం, పుస్తకాలు సెంటర్ల వద్దే పెట్టుకోవడం, వంటి ఘటనలను చోటు చేసుకున్నాయి. జిల్లాలో మొదలైన ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ పరీక్షల్లో మొదటి రోజు యథేచ్ఛగా మాస్ కాపీయింగ్ జరిగింది. పరీక్షల నిర్వహణలో పారదర్శకత లేదనే విమర్శలు ఉన్నాయి.

**మేము మాట్లాడేశాం...చీటీలు తీసుకెళ్లండి..**

జిల్లాలోని ఓపెన్ స్కూల్ స్టడీ కేంద్రాల నిర్వాహకులు అభ్యర్థులను మోసం చేస్తున్నారు. సులువుగా పరీక్షలు ఉత్తీర్ణత చేయిస్తామని ముందస్తుగా ఒప్పందాలు కుదుర్చుకుని వసూళ్లకు పాల్పడ్డారు. ఇంటర్మీడియట్ పరీక్షలు రాస్తున్న అభ్యర్థుల నుంచి రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు డబ్బులు ముందస్తుగా వసూళ్లు చేశారు. పరీక్షలు ప్రారంభం సమయానికి చిట్టీలు తీసుకెళ్లండి అధికారులతో మేం మాట్లాడేశాం అంటూ అభ్యర్థులను నమ్మబలికారు. దీంతో సోమవారం ప్రారంభమైన ఓపెన్ స్కూల్ పరీక్ష కేంద్రాలకు హాజరైన పలువురు అభ్యర్థులు చిట్టీలతో హాజరయ్యారు.

- జిల్లా కేంద్రంలోని గిరింపేట నగరపాలక పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాసేందుకు విచ్చేసిన పలువురు అభ్యర్థులు చిట్టీలు తీసుకొచ్చి పోలీసుల తనిఖీల్లో దొరికిపోయారు.
- చిత్తూరు జిల్లా కేంద్రంలోని సంతపేట పీఏన్సీ నగరపాలక పరీక్ష కేంద్రంలో ఇలాంటి ఘటనలే చోటు చేసుకున్నాయి.
- పరీక్ష కేంద్రాల సమీపంలో జిరాక్స్ సెంటర్లు తెరవడానికి వీల్లేదు. అయితే జిల్లా కేంద్రంలోని గిరింపేట నగరపాలక పరీక్ష కేంద్రానికి సమీపంలో జిరాక్స్ సెంటర్ మొదటి రోజు తెరిచే ఉంచారు.



గిరింపేట పరీక్ష కేంద్రం వద్ద చూచిరాతలకు సిద్ధంగా పెట్టుకున్న బ్యాగులు



గిరింపేట పరీక్ష కేంద్రంలో పరీక్షలు రాసేందుకు వెళ్తున్న అభ్యర్థులు

### గొప్పలు పలికిన విద్యాశాఖ అధికారులు

ఓపెన్ స్కూల్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని జిల్లా విద్యాశాఖ అధికారులు గొప్పలు పలికారు. ఓపెన్ స్కూల్ పరీక్షల్లో యథేచ్ఛగా చూచిరాతలు జరగడంతో విమర్శలు గుప్పుమంటున్నాయి. అభ్యర్థుల నుంచి చేసిన వసూళ్లపై సాక్షిలో ఈనెల 3వ తేదీన ఓపెన్ బేరం శీర్షికతో ముందస్తుగానే కథనం ప్రచురితమైన విషయం విధితమే. అదే విధంగానే పలువురు అభ్యర్థులు చూచిరాతలకు ప్రయత్నించడం, నకిలీ అభ్యర్థులు దొరకడం వంటి ఘటనలు బయటపడ్డాయి. ఈ ఘటనలను బటి అధికారులు పరీక్షలను ఎంత పకడ్బందీగా నిర్వహిస్తున్నారో బట్టబయలైంది.

### ఇద్దరు నకిలీ అభ్యర్థులు

ఏపీ ఓపెన్ స్కూల్ పరీక్షల్లో సోమవారం ఇద్దరు నకిలీ అభ్యర్థులను గుర్తించారు. జిల్లాలోని జెడ్పీ గంగాధర నెల్లూరు, పుంగనూరు బాలికల జెడ్పీ హైస్కూల్ పరీక్ష కేంద్రాల్లో ఒకరికి బదులు మరొకరు పరీక్షలు రాసేందుకు కేంద్రాలకు విచ్చేశారు. ఈ ఇద్దరు అభ్యర్థులు ముందస్తుగానే సంబంధిత స్టడీ సెంటర్ల నిర్వాహకులతో డీల్ కుదుర్చుకున్నట్లు అనుమానాలు వెలువెత్తుతున్నాయి. అయితే వారిని సంబంధిత రెండు పరీక్ష కేంద్రాల చీఫ్ సూపరింటెండెంట్‌లు కనిపెట్టి విద్యాశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. దీంతో జెడ్పీ గంగాధరనెల్లూరు కేంద్రంలో (2420178300), పుంగనూరు బాలికల జెడ్పీ హైస్కూల్ కేంద్రంలో (2420180554) హాల్‌టికెట్ నంబర్లతో పరీక్షలు రాసేందుకు నకిలీ అభ్యర్థులు విచ్చేశారు. వారిద్దరిపై విద్యాశాఖ అధికారులు గంగాధర నెల్లూరు, పుంగనూరు పోలీస్‌స్టేషన్‌లలో కేసు నమోదు చేసి పోలీసులకు అప్పగించారు. జిల్లాలో సోమవారం ప్రారంభమైన ఓపెన్ స్కూల్ ఇంటర్మీడియట్ మొదటి రోజు పరీక్షకు 2,894 మంది అభ్యర్థులకు గాను 2,415 మంది హాజరుకాగా 477 మంది గైర్హాజరైనట్లు డీఈఓ వరలక్ష్మి వెల్లడించారు.

## క్లుప్తంగా

### పరీక్ష కేంద్రం తనిఖీ

చిత్తూరు అర్బన్ : నగరంలో జరుగుతున్న ఇంటర్ పరీక్షలకు సంబంధించి భద్రతా ఏర్పాట్లను ఎస్పీ మణికంఠ తనిఖీ చేశారు. సోమవారం నగరంలోని పీసీఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణను పరిశీలించిన ఆయన.. అధ్యాపకులకు పలు సూచనలు చేశారు. అలాగే పరీక్ష కేంద్రాల లోపల ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల పనితీరు, బందోబస్తును తనిఖీ చేశారు. పరీక్షలు పారదర్శకంగా జరగడానికి పిల్లల తల్లిదండ్రులు, అధ్యాపకులు సహకరించాలని కోరారు.

### ఇరువర్గాల ఘర్షణ.. కత్తితో దాడి

చిత్తూరు అర్బన్ : చిత్తూరు నగరంలో సోమవారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగి కత్తులతో దాడులు చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ జయరామయ్య కథనం మేరకు.. దుర్గానగర్ కాలనీలో నివాసం ఉంటున్న మోహన్ ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. చామంతిపురంలోని ఓ సూపర్ మాల్‌లో పనిచేస్తున్న తేజ, పాండ్య, మల్లికార్జునకు .. మోహన్‌కు పాత గొడవల విషయమై వాగ్వాదం చోటుచేసుకుంది. తొలుత దుర్గానగర్ కాలనీలోని మోహన్ ఇంటికి వద్దకు వెళ్లి, అతడి తల్లిపై తేజ దాడి చేశాడు. ఆ సమయంలో మోహన్ ఇంటి వద్ద లేకపోవడంతో అతడి సోదరుడు రాజేష్ తదితరులు చామంతి పురం ఆంజనేయస్వామి గుడి వద్ద ఉన్న తేజ , పాండియన్, మల్లికార్జున్ పై కత్తితో దాడి చేశారు. ఈ ఘటనలో పలువురికి రక్త గాయాలు కావడంతో చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# రహదారి రక్తసిక్తం

లైటు లేకుండా వస్తున్న బైక్‌ను ప్రమాదవశాత్తు కారు ఢీకొనడంతో ద్విచక్రవాహనదారుడితో పాటు కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు మొత్తం నలుగురు సంఘటనా స్థలంలోనే దుర్మరణం చెందారు. ఒకే కుటుంబంలోని ముగ్గురు వ్యక్తులు మృతి చెందడంతో తీవ్ర విషాదం అలుముకుంది. మరో నలుగురికి తీవ్ర గాయాలు కావడంతో సంఘటన స్థలం రక్తసిక్తంగా మారింది.

- బైక్‌ను ఢీకొన్న కారు
- కేజీఎఫ్– మాలూర్ ఎక్స్‌ప్రెస్ హైవేలో ఘోర రోడ్డు ప్రమాదం
- ఘటనా స్థలంలోనే నలుగురు మృత్యువాత
- మరో నలుగురికి తీవ్ర గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన మహేష్, చిన్నారి ఉద్విత, రత్నమ్మ

వి.కోట : కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా బంగారు పేట తాలూకా కుప్పనపల్లి సమీపంలో ఇటీవల మొదలైన ఎక్స్‌ప్రెస్ వేలో ఆదివారం రాత్రి ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. కర్ణాటక రాష్ట్రం వి.కోటకు కూతవేటు దూరంలో ఉన్న కదిరిగాని కుప్పం గ్రామానికి చెందిన శీనప్ప కుమారుడు మహేష్ (50) కుటుంబ సభ్యులతో కలిసి బెంగుళూరు ఆస్పత్రిలో ఉన్న వాళ్ల తండ్రిని చూసి తిరిగి ఇన్నోవా కారులో వస్తున్నారు. ఈ క్రమంలో కేజీఎఫ్–బంగారుపేట్ మధ్యన కుప్పనపల్లి సమీపంలో ఎదురుగా ద్విచక్ర వాహనం లైట్లు లేకుండా రావడంతో ప్రమాదవశాత్తు కారు ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. ఈ ఘటనలో ద్విచక్రవాహదారుడితో పాటు కారులో ప్రయాణిస్తున్న కదిరిగాని కుప్పం గ్రామానికి చెందిన సీనప్ప కుమారుడు మహేష్(52), కమ్మసంద్రానికి చెందిన జయరామప్ప భార్య రత్నమ్మ (60), సంతోష్ కుమార్తె ఉద్విత(2)తో పాటు ద్విచక్రవాహనంలో ఉన్న యువకుడు ఘటనా స్థలంలోనే మృతి చెందారు. అలాగే కారులో ప్రయాణిస్తున్న సంతోష్ భార్య సుస్మిత (30), ఆమె కుమారుడు విరాట్(6), సుజాత (48), కారు డ్రైవర్ సునీల్ (28) తీవ్రంగా గాయపడగా వారిని కోలార్ మెడికల్ ఆస్పత్రికి తరలించారు. అంతేకాక క్షతగాత్రులో ఒక్కరైన సుష్మిత 8 నెలల గర్భిణి కావడంతో ఆమెను..కడుపులోని శిశువును కాపాడానికి వైద్యులు చేసిన ప్రయత్నాలు విఫలం కాగా సుష్మిత మత్యువుతో పోరాడుతోంది. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు వ్యక్తులు మృతి చెందడంతో ఆ కుటుంబంలో తీరని విషాదఛాయలు అలుముకున్నాయి. ఎక్స్‌ప్రెస్ హైవేలో వాహనాల రాకపోకలకు అనుమతించిన బంగారుపేట–కేజీఎఫ్ మధ్య ఒకే వైపు అటు– ఇటు వచ్చే వాహనాలు వెళ్లి వస్తుండటంతో ఈ ప్రమాదం చోటు చేసుకున్నట్లు తెలుస్తోంది. బంగారు పేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గోల్డ్ లోన్ బ్యాంకు అక్రమాలపై కేసు

- కనకదుర్గ గోల్డ్‌లోన్ బ్యాంకులో రూ.కోట్లలో మోసం
- పలమనేరు బ్రాంచి సిబ్బందిపై విచారణ

పలమనేరు : పలమనేరులోని కనకదుర్గ గోల్డ్‌లోన్ బ్యాంకులో రూ.కోట్లలో జరిగిన అక్రమాలపై స్థానిక పోలీసులు కేసు నమోదు చేసినట్టు తెలిసింది. ఇప్పటికే ఇదే బ్యాంకు పుంగనూరు బ్రాంచిలో బాధితుల ఫిర్యాదు మేరకు అక్కడి పోలీసులు బ్యాంకు సిబ్బందిపై కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. అయితే ఇక్కడి బ్రాంచి అక్రమాలపై ఫిర్యాదు రాక పోలీసులు ఇప్పటి దాకా వేచి చూశారు. సోమవారం దీనిపై ఫిర్యాదు అందడంతో స్థానిక పోలీసులు దీనిపై విచారణ చేస్తున్నట్లు తెలుస్తోంది.

**ఆడిట్‌లో వెలుగుచూసిన అక్రమాలు...**

పుంగనూరు, పలమనేరులోని గోల్డ్ పట్టణాల్లో గ్రాముకు ఎక్కువ ధరతో రుణాలిస్తామంటూ వీరు రూ.8 కోట్ల అక్రమాలకు పాల్పడగా ఇందులో పలమనేరులో జరిగిన అక్రమాలు రూ.2.80 కోట్లుగా ఉన్నట్లు ఆడిట్‌లో వెలుగు చూసిన విషయం తెలిసిందే. దీనిపై పుంగనూరులో బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదైంది. ఇప్పుడు పలమనేరులోనూ ఫిర్యాదులు రావడంతో ఇక్కడి బ్రాంచి అక్రమాలపై పోలీసులు లోతుగా విచారిస్తున్నట్లు తెలిసింది. ఈ విషయంపై వివరాలను పోలీసులు అధికారికంగా వెల్లడించలేదు. ఇదంతా ఇంటి దొంగలపనేని విషయంపై పోలీసులు లోతుగా విచారిస్తున్నారు.





అక్రమాలు జరిగిన పలమనేరులోని బంగారు తనఖా బ్యాంకు

## సీనియారిటీ జాబితాపై అభ్యంతరాల స్వీకరణ

చిత్తూరు కలెక్టరేట్ /తిరుపతి అర్బన్: ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని హెచ్‌ఎంలు, టీచర్ల సాధారణ సీనియారిటీ జాబితాలో అభ్యంతరాలుంటే తెలపాలని డీఈవోలు వరలక్ష్మి, కేవీఎస్ కుమార్ తెలిపారు. వారు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో అన్ని యాజమాన్యాల కింద పనిచేస్తున్న టీచర్ల సీనియారిటీ జాబితాను ఉపాధ్యాయ సమాచార వ్యవస్థ ఆధారంగా రూపొందించినట్లు తెలిపారు. ఈ జాబితాలను www.chittoordeo.com వెబ్‌సైట్‌లో ఉంచినట్టు తెలిపారు. వాటిపై అభ్యంతరాలు ఉంటే డీడీవో సంతకంతో ఈ నెల 10వ తేదీ మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 7 గంటలలోపు చిత్తూరు డీఈవో కార్యాలయంలో అందజేయాలన్నారు. టీచర్ పూర్తి పేరు, కేడర్, సంబంధిత వివరాలు, సీనియారిటీ జాబితాలోని తప్పిదాన్ని స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. ఆధారాలతో పాటు సంబంధిత డాక్యుమెంట్స్ జతచేయాలన్నారు. గడువు తర్వాత అందే అభ్యంతరాలను స్వీకరించబోమని వెల్లడించారు. వివరాల కోసం చిత్తూరు డీఈవో కార్యాలయంలో సంప్రదించాలన్నారు.

## సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా



అటానమస్ హోదాపై మాట్లాడుతున్న సిద్ధార్థ విద్యాసంస్థల సెక్రటరీ ఆనందరెడ్డి

తిరుపతి రూరల్: తిరుపతి రూరల్ మండలం సి.గొల్లపల్లెలోని సిద్ధార్థ ఇంజినీరింగ్, ఎంబీఏ కళాశాలలకు యూజీసీ అటానమస్ హోదా (స్వయంప్రతిపత్తి) లభించిందని సిద్ధార్థ ఎడ్యుకేషనల్ అకాడమీ సెక్రటరీ వై.ఆనందరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 1985లో రాయలసీమ ప్రాంతంలో పేద విద్యార్థులకు నాణ్యమైన కార్పొరేట్ విద్యను అందించాలనే ఉద్దేశంతో వై.కొండారెడ్డి, యం.వెంకట్రామిరెడ్డి రాయలసీమ విద్యాసంస్థలను ప్రారంభించినట్టు వివరించారు. గత 40 ఏళ్లుగా విద్యాసంస్థల్లో అనేక విప్లవాత్మక మార్పులు తీసుకురావడమే కాకుండా కొత్త రకం కోర్సులను తెచ్చి విద్యార్థులను ఉన్నత స్థాయిలో స్థిరపడేలా చేయడం జరిగిందన్నారు. పేద విద్యార్థులకు టెక్నికల్ విద్యను కూడా చేరువ చేయాలన్న ఉద్దేశంతో 2009లో సిద్ధార్థ ఇంజినీరింగ్, ఎంబీఏ కళాశాలలను స్థాపించినట్టు తెలిపారు. విద్యార్థులకు అన్నిరకాలు శిక్షణ అందించి మల్టీ నేషనల్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశం సంపాదించుకునేలా చేయడం జరిగిందన్నారు. ఈ విద్యాసంవత్సరంలో నాక్ గుర్తింపు పొంది స్వయంప్రతిపత్తి హోదాను సాధించినట్టు వివరించారు. కళాశాల చైర్మన్ వై.కొండారెడ్డి, వైస్ చైర్మన్ విజయ్‌రెడ్డి, ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ పాల్గొన్నారు.

## ఎంబీఏ విద్యార్థులకు స్కిల్ శిక్షణ



నైపుణ్యాభివృద్ధిపై శిక్షణ పొందుతున్న విద్యార్థులతో ప్రిన్సిపాల్, అధ్యాపకులు

తిరుపతి సిటీ : కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీలో భాగంగా బజాజ్ ఫైన్ సర్వీస్ సంస్థ స్థానిక కరకంబాడి రోడ్డులోని ఎస్వీసీఈ కళాశాల ఎంబీఏ విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌పై శిక్షణ ఇచ్చారు. కళాశాలలో సోమవారం జరిగిన ఈ కార్యక్రమంలో ముంబై వాల్‌చంద్ పీపుల్స్ ప్రాజెక్ట్ హెడ్ రష్మి మన్సాని ఆన్‌లైన్ ద్వారా పాల్గొన్నారు. విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్, పారిశ్రామిక రంగంలో ఉద్యోగాల సాధనకు అవసరమైన నైపుణ్యం గురించి వివరించారు. ఉద్యోగాన్వేషణలో బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థులు అడిని సందేహాలను నివృత్తి చేశారు. పలు సలహాలు, సూచనలు అందజేశారు. కార్యక్రమంలో ఎస్వీసీఈ ప్రిన్సిపాల్ సుధాకర్‌రెడ్డి, హెడ్ ప్రొఫెసర్ నీరజ, బజాజ్ ఫైన్ సర్వీస్ ప్రోగ్రామ్ ఇన్‌చార్జి రామకృష్ణ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఓపెన్‌స్కూల్ పరీక్షల్లో నకిలీ విద్యార్థులు

- స్క్వాడ్ తనిఖీలో దొరికి జైలుకు

పుంగనూరు/ గంగాధర నెల్లూరు : ఓపెన్‌స్కూల్ పరీక్షల్లో పుంగనూరు, గంగాధర నెల్లూరులో అక్రమాలు వెలుగుచూశాయి. పుంగనూరు జెడ్పీ బాలికల హైస్కూల్‌లో ఒక విద్యార్థి పేరుతో మరొక విద్యార్థి పరీక్ష రాస్తూ అడ్డంగా దొరికిపోయిన సంఘటన సోమవారం జరిగింది. పట్టణంలోని బసవరాజ హైస్కూల్, జెడ్పీ బాలికల హైస్కూల్ ,కొత్తయిండ్లు మున్సిపల్ హైస్కూల్‌లో తొలిరోజు పరీక్షలు ప్రారంభమయ్యాయి. పరీక్షల్లో చౌడేపల్లెకి చెందిన వంశీకృష్ణ ఇంటర్ పరీక్షలు రాయాల్సి ఉంది. కానీ అతని పేరుతో మదనపల్లెకి చెందిన అతడి స్నేహితుడు ప్రవీణ్ కుమార్ పరీక్షరాస్తూ స్క్వాడ్ తనిఖీలో పట్టుబడ్డాడు. వెంటనే నకిలీ విద్యార్థి వద్ద పరీక్షపత్రాలు తీసుకుని పోలీసులకు సమాచారం అందించారు. సీఐ శ్రీనివాసులు పరీక్ష కేంద్రానికి వెళ్లి నకిలీ విద్యార్థిని అదుపులోనికి తీసుకుని స్టేషన్‌కు తరలించి, నకిలీ విద్యార్థితో పాటు మరో విద్యార్థిపై కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై జెడ్పీ బాలికల హైస్కూల్‌లో పరీక్ష నిర్వాహకులపై పలు అనుమనాలు వ్యక్తం అవుతున్నాయి.

**అభ్యర్థి ఒకరు..పరీక్షకు మరొకరు..**

ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్షలో మాల్ ప్రాక్టీస్ చేస్తూ ఇన్విజిలేటర్‌కు అడ్డంగా దొరికిపోయిన అభ్యర్థిపై కేసు నమోదు చేసిన సంఘటన గంగాధర నెల్లూరు మండలంలో చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల వివరాల మేరకు మండల కేంద్రంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఓపెన్ ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రంలో సోమవారం ఓ వ్యక్తికి బదులు మరొక వ్యక్తి పరీక్ష రాయడానికి వచ్చి ఇన్విజిలేటర్‌కు దొరికిపోవడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు హేమలత పోలీసులకు ఫిర్యాదు చేశారు. జయకుమార్ అనే వ్యక్తి తన ఇంటర్మీడియట్ ఓపెన్ పరీక్షను దేవేంద్ర నాయుడు అనే వ్యక్తిని పంపించి పరీక్ష రాయడానికి ప్రయత్నించగా ఇన్విజిలేటర్‌కు దొరికిపోవడంతో ఈ సంఘటన బయటపడింది. జయకుమార్.. కొండేపల్లి గ్రామ సచివాలయంలో డిజిటల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న సతీష్ పూర్వ స్నేహితులు కావడంతో కొండేపల్లి గ్రామంలో చదువుకుని నిరుద్యోగిగా ఉన్న దేవేంద్ర నాయుడుకు కొంత డబ్బు ఇచ్చి పరీక్ష రాయడానికి సన్నద్ధం చేశారని ప్రాథమిక విచారణలో తేలిందని తెలిపారు. ఈ సందర్భంగా దేవేంద్ర నాయుడు ఏ–1 గా, ఏ–2 జయకుమార్ ,ఏ–3 గా సతీష్ పై కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ శ్రీనివాసంతి తెలిపారు.

## ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలి

- రాయలసీమ మాలల జేఏసీ డిమాండ్

బంగారుపాళెం : ఎస్సీ వర్గీకరణను రద్దు చేయాలంటూ రాయలసీమ జేఏసీ డిమాండ్ చేసింది. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 23న తలపెట్టిన 'రాయలసీమ మాలల సింహగర్జన' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. స్థానిక దళితవాడలో సోమవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రాయలసీమ మాలల జేఏసీ చైర్మన్ చంద్రయ్య మాట్లాడుతూ.. ఒకే కులానికి ప్రభుత్వాలు కొమ్ముకాస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో సీఎం చంద్రబాబు ఎస్సీ వర్గీకరణకు సై అంటూ జైకొట్టి రాజకీయ లబ్ధిపొందాలని అనుకుంటున్నారని ఆరోపించారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ ఈనెల 23న తిరుపతిలోని నెహ్రూ మున్సిపల్ స్కూల్ గ్రౌండ్ ఆవరణలో నిర్వహించనున్న రాయలసీమ మాలల సింహగర్జన కార్యక్రమానికి తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ప్రధాన కార్యదర్శి ప్రభాకర్, తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల అధ్యక్షులు ధనశేఖర్, శివ, సుదర్శన్, నాయకులు పాల్గొన్నారు.



బంగారుపాళెంలో పోస్టర్లను ఆవిష్కరిస్తున్న రాయలసీమ మాలల జేఏసీ నేతలు

## బెల్లం విక్రయాలపై నిఘా

చిత్తూరు అర్బన్ : నాటుసారా తయారీకి ప్రధాన ముడి సరుకుగా ఉన్న బెల్లం సారా తయారీకి ఇవ్వొద్దని ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ జిల్లా డిప్యూటీ కమిషనర్ (డీసీ) విజయశేఖర్ కోరారు. నవోదయం 2.0లో భాగంగా సోమవారం చిత్తూరు నగరంలో బెల్లం వ్యాపారులతో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ అధికారులు సమావేశం నిర్వహించారు. డీసీ మాట్లాడుతూ.. ఎవరు సారా తయారీకి వస్తున్నారు..? ఎవరికి బెల్లం అవసరమనే విషయాలపై వ్యాపారులకు అవగాహన ఉండాలన్నారు. సారా తయారీ, విక్రయాల నివారణకు బెల్లం వ్యాపారులు సహకరించాలని కోరారు. ఇందుకోసం ప్రతి 15 రోజులకు ఒకసారి వ్యాపార లావాదేవీలను తమకు అందజేయాలన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి, రాష్ట్ర టాస్క్‌ఫోర్స్ సుధాకరరెడ్డి, చిత్తూరు అర్బన్ సీఐ శ్రీహరి రెడ్డి, బెల్లం వ్యాపారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎక్సైజ్ డీసీ విజయశేఖర్

## మద్యం విక్రయం.. కేసు నమోదు

చిత్తూరు రూరల్(కాణిపాకం) : మండలంలోని తుమ్మిందలో సోమవారం అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని తాలూకా పోలీసులు పట్టుకున్నారు. అందిన సమాచారం మేరకు పోలీసులు గ్రామంలో అక్రమ మద్యం విక్రయాలపై తనిఖీ చేపట్టారు. ఈ తనిఖీలో మున్నెప్ప అనే వ్యక్తి నుంచి 10 బాటిళ్ల మద్యం బాటిళ్లను పట్టుకున్నారు. కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ మల్లికార్జున పేర్కొన్నారు.

## స్వీయరక్షణలో పట్టు సాధించాలి

చిత్తూరు కలెక్టరేట్ : బాలికలకు చిన్నప్పటి నుంచే ఆత్మరక్షణపై పట్టు సాధించడం ముఖ్యమని జిల్లా సమగ్రశిక్ష శాఖ ఏపీసీ వెంకటరమణ అన్నారు. ఈ మేరకు సోమవారం జిల్లా కేంద్రంలోని ఓటికే రోడ్డులో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని ఏపీసీ సందర్శించారు. ఆ పాఠశాలలో రూపేష్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి అతిథిగా పాల్గొన్నారు. ఆత్మరక్షణ అన్నది జీవిత నైపుణ్యం అన్నారు. బాలికలపై క్రమేణా పెరుగుతున్న నేరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఆత్మరక్షణపై శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తోందన్నారు. ఏ సమయంలోనైనా ఊహించని ఘటనలు చోటు చేసుకుంటే ఆత్మరక్షణపై పట్టు ఉంటే ధైర్యంగా ఎదుర్కోవచ్చన్నారు. కార్యక్రమంలో నమోదు చేసుకున్న బాలికలకు మూడు నెలల పాటు ఆత్మరక్షణ శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. రూపేష్ ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఎండీ రూపేష్ మాట్లాడుతూ.. హెచ్‌ఎంలు స్వీయరక్షణ శిక్షకుడికి కోర్సును నేర్పేందుకు 10 క్లాస్‌లను కేటాయించాలన్నారు. కార్యక్రమంలో సొసైటీ మాస్టర్స్ దివ్య, హేమంత్ పలువురు పాల్గొన్నారు.

## ఇళ్ల మధ్య వ్యభిచారం.. పోలీసుల దాడులు

చిత్తూరు అర్బన్ : నగరంలో ఇళ్ల మధ్య వేశ్య గృహం నిర్వహిస్తున్న వారిపై పోలీసులు దాడులు చేశారు. నగరంలోని రామ్‌నగర్ కాలనీలో కొద్ది కాలంగా వ్యభిచారం జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. టూటౌన్ సీఐ నెట్టికంటయ్య సిబ్బందితో కలిసి రామ్‌నగర్ కాలనీ ఎక్స్‌టెన్షన్ వద్ద దాడులు నిర్వహించారు. ఓ ఇంటిని అద్దెకు తీసుకుని, వ్యభిచారం చేయిస్తున్న నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అలాగే ముగ్గురు మహిళలతో పాటు ముగ్గురు విటులను స్టేషన్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

## బాలుడి ముక్కులో ఇరుక్కున బ్యాటరీ

పలమనేరు : బాలుడి ముక్కులోకి రిస్ట్‌వాచ్ బ్యాటరీ ఇరుక్కున్న ఘటన సోమవారం పట్టణంలో జరిగింది. పెద్దపంజాణి గ్రామానికి చెందిన ఫర్హాన్ అనే నాలుగేళ్ల బాలుడు ఇంట్లో ఆడుకుంటూ రిస్ట్‌వాచ్ బ్యాటరీని ముక్కులోకి వేసుకున్నాడు. అదిలోనికెళ్లి శ్వాస తీసుకోకుండా ఇబ్బంది పడ్డాడు. దీన్ని గమనించిన తల్లిదండ్రులు పట్టణంలోని సాయిరాం ఆస్పత్రికి తీసుకురాగా ఈఎన్‌టీ వైద్యుడు యుగంధర్ చాకచక్యంగా ముక్కులోంచి బ్యాటరీని బయటికి తీశారు. కాయిన్స్‌లాంటివి మింగినా ప్రాణానికి అపాయం లేదుగాని రిస్ట్‌వాచ్ బ్యాటరీని మింగినా, ముక్కులో వేసుకున్న అందులోని లీథియం కారణంగా రంధ్రాలు పడి పిల్లలు మృతి చెందే అవకాశం ఉంటుందని ఆయన తెలిపారు. తల్లిదండ్రులు వాడేసిన బ్యాటరీలకు పిల్లలకు దూరంగా పడేయాలని సూచించారు.

## పోలీసులకు చిక్కిన గొలుసు దొంగ

- 32 గ్రాముల బంగారు నగలు స్వాధీనం



స్వాధీనం చేసుకున్న నగలు, డబ్బులతో పాటు నిందితుడిని అరెస్టు చూపుతున్న ఎస్‌డీపీఓ

పుత్తూరు : ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసి వారి మెడలో ఉన్న బంగారు గొలుసులు దోచుకెళ్లే కొత్తపల్లి బాలకృష్ణ (40) అనే నిందితుడిని పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. సీఐ కేవీ సురేంద్రనాయుడు తెలిపిన వివరాల మేరకు.. గతనెల 18వ తేదీన పుత్తూరు పట్టణంలోని షాపు వీధి ఎక్స్‌టెన్షన్‌లోని భారతి (65) అనే మహిళ ఇంట్లో ఒంటరిగా ఉండగా గుర్తుతెలియని వ్యక్తి ఆమె వద్దకు వచ్చి ఇంటి పై పోర్షన్ అద్దెకు కావాలని చూపించాలని కోరాడు. అలా అద్దెకు ఇచ్చే నిమిత్తం ఇంటి పైపోర్షన్ చూపిస్తున్న క్రమంలో మహిళ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కొని ఉడాయించాడు. బాధితురాలి కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. చోరీకి పాల్పడిన వ్యక్తి పాలెంపల్లి గ్రామా నికి చెందిన కొత్తపల్లి చెంగల్ రాయలు కుమారుడు కొత్తపల్లి బాలకృష్ణ అని విచారణలో తేలింది. సోమవారం నిందితుడిని అరెస్టు చేశారు. పుత్తూ రు అర్బన్ పీఎస్ ఎస్ఐ ఓబయ్య నిందితుడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని అంగీకరించినట్లు తెలిపారు. దొంగతనం చేసిన రూ.2.36 లక్షల విలువగల 32 గ్రాముల బంగారు గొలుసులను పోలీసులకు అందజేశాడు.

**ఒంటరి మహిళలే టార్గెట్**

చెడు వ్యసనాలకు బానిసైన బాలకృష్ణకు డబ్బు అవసరం ఎక్కువగా ఉండేది. తొలుత అప్పులు చేస్తూ వచ్చినా అప్పిచ్చేవారు పదే పదే అడుగుతూ ఉండటం ఇబ్బందికరంగా ఉండేది. దీంతో ఒంటరిగా ఉన్న మహిళలను టార్గెట్ చేసి వారి మెడ లోనుంచి బంగారు గొలుసు కాజేసే పనికి పూనుకున్నాడు. అలా పోలీసులకు చిక్కి కటకటాలపాలయ్యాడు. నిందితుడిని పట్టుకోవడంలో చొరవ చూపిన ఎస్ఐ, సిబ్బంది దాము, రఘు, వేలు, ఉదయగిరిని ఎస్‌డీపీఓ అభినందించారు.

## లారీ సహా 40 టన్నుల ఇసుక స్వాధీనం

చిత్తూరు అర్బన్ : అక్రమంగా ఇసుక తరలిస్తున్న లారీని పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జున తెలిపారు. వివరాలు ఇలా.. చిత్తూరు నగరం మురకంబట్టు ప్రాంతంలో అనుమానితంగా కనిపించిన లారీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. పరిశీలిస్తే అక్రమంగా ఇసుక తరలిస్తున్నట్లు గుర్తించారు. తిరుపతి జిల్లా చింతవరం సముద్రం ఒడ్డున ఇసుక అక్రమంగా తవ్వకాలు చేసి చెన్నైకి తరలిస్తున్నట్లు తెలుసుకున్నారు. లారీతో పాటు 40 టన్నుల ఇసుకను స్వాధీనం చేసుకుని...లారీ డ్రైవర్ వంశీకృష్ణ, యజమాని మహేష్ పై కేసులు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

# విన్నపాలు..వినవలె

- కలెక్టరేట్‌లో ప్రజాసమస్యల పరిష్కార వేదిక
- పలు ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు
- వివిధ శాఖలకు సంబంధించి 206 అర్జీలు నమోదు
- అర్జీలు స్వీకరించిన కలెక్టర్ , జేసీ విద్యాధరి

చిత్తూరు కలెక్టరేట్ : ప్రతి వారం కలెక్టరేట్‌కు విచ్చేసి అర్జీలు ఇస్తూనే ఉన్నాం....సమస్యలు మాత్రం పరిష్కారానికి నోచుకోవడం లేదు...తిరిగి తిరిగి వేషారిపోతున్నాం....కాస్త దయ చూపి తమ సమస్యలను పరిష్కరించండి సారూ... అంటూ జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు ఉన్నతాధికారులను వేడుకున్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన ప్రజలు సమస్యలు పరిష్కరించాలంటూ అర్జీలు అందజేశారు. కలెక్టర్ సుమిత్ కుమార్ గాంధీ మాట్లాడుతూ.. అర్జీల పట్ల అలసత్వం ప్రదర్శిస్తే కఠిన చర్యలుంటాయని హెచ్చరించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ విద్యాధరి, ట్రైనీ కలెక్టర్ హిమవంశీ, డీఆర్‌వో మోహన్‌కుమార్ తదితరులు ప్రజల నుంచి వినతులు స్వీకరించారు.

**ఫౌండేషన్ స్కూల్ నివేదిక రద్దు చేయండి**

ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఇబ్బందికరంగా మారే ఫౌండేషన్ స్కూల్ నివేదికలను రద్దు చేయాలని గంగవరం మండలం జేఆర్ కొత్తపల్లి ప్రాథమిక పాఠశాల చైర్మన్, కీలపల్లి పంచాయతీ ఎంపీటీసీ నాగేంద్రరెడ్డి కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు జెడ్పీ చైర్మన్ గోవిందప్ప శ్రీనివాసులతో కలిసి ఆ గ్రామస్థులు సోమవారం కలెక్టర్ ను కలిశారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు కేశవ, రమణారెడ్డి, వరద తదితరులు పాల్గొన్నారు.

### పట్టాలు ఇప్పించండి సారూ



దయతో పట్టాలను ఇప్పించండి సారూ అంటూ గుడిపాల మండలం రెడ్డిగుంట ఎస్టీ కాలనీకి చెందిన లీలావతి, శశికళ కోరారు. ఈ మేరకు వారు కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ ..చిత్తూరు రూరల్ మండలం తాళంబేడు రెవెన్యూ దాఖలాల్లో సర్వే నంబర్ 573 లో దాదాపు 10.23 ఎకరాల డీకేటీ భూమిలో వ్యవసాయం చేసుకుంటున్నట్లు చెప్పారు. గత ప్రభుత్వ పాలనలో 4 కుటుంబాలకు పట్టాలు ఇచ్చారని మిగిలిన 6 కుటుంబాలకు పట్టాలు ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఆ గ్రామస్థులు రమణి, బేబి తదితరులు పాల్గొన్నారు.

### శ్రీవివేకానంద (సీకేపల్లి) కళాశాలపై చర్యలు తీసుకోండి



జిల్లా కేంద్రంలోని సీకేపల్లి వద్ద ఉన్న శ్రీ వివేకానంద కళాశాల నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలని సీకేపల్లికి చెందిన ప్రజలు ప్రగతి, అరుణ కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కళాశాలకు చెందిన 30 బస్సులను తమ నివాసాల వద్ద పార్కింగ్ చేస్తూ ఇబ్బందులు సృష్టిస్తున్నారని చెప్పారు. బయట రాష్ట్రం నుంచి తెచ్చిన డీజిల్ ట్యాంకులను ఇళ్ల మధ్యలో పెట్టి అక్రమంగా బస్సులకు డీజిల్ నింపుకుంటున్నారన్నారు. స్థానిక మహిళలపై అసభ్యంగా ప్రవరిస్తున్నారని వాపోయారు. ఈ ఘటనపై పలువురు అధికారులను విచారణ చేసి నివేదిక ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సీకేపల్లికి చెందిన సుగుణ, అరుణ, ధనలక్ష్మి, శ్వేత, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

### మున్సిపల్ కార్మికుల వేతనాల చెల్లింపు ఏజెన్సీలకు వద్దు



మున్సిపల్ శాఖలో పనిచేస్తున్న కార్మికుల వేతనాల చెల్లింపు ప్రైవేట్ ఏజెన్సీలకు అప్పజెప్పకూడదని మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఉమ్మడి జిల్లా కార్యదర్శి రామచంద్రయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ సంఘ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజు మాట్లాడుతూ.. ఆప్కాస్ ను రద్దు చేసి తమ పార్టీ కార్యకర్తలకు మున్సిపల్ కార్మికులను బదలాయించడానికి కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. కార్మికులకు అన్యాయం చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. ధర్నాలో ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, పట్టణ కార్యదర్శి దాసరి చంద్ర, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు పాల్గొన్నారు.